సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 9 । జూన్ । 2024



చదువు భారం..
వేసవి సెలవులు మరో నాలుగు రోజుల్లో ముగియనున్నాయి. పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయం కావడంతో ప్రతీ కుటుంబానికి ఖర్చులు పెరగనున్నాయి. -8లో



టీకాలతో 'చిటుక' నివారణ
జీవాలకు ఆశించే చిటుక రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ రోగం ఆశిస్తే జీవాలు నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. -8లో



వార్షికవేతనం @ 50 లక్షలు
నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన కుసుమంచి చైతన్య రూ.50లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సంపాదించాడు. -8లో

న్యూస్‌రీల్

బ్రిడ్జి పనులు పరిశీలించిన కలెక్టర్



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పాచిపెంట: మండలంలోని కుంతాం – తుమ్మ గుడ్డి రహదారిలో నిర్మిస్తున్న హై లెవిల్ బ్రిడ్జి పనులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. సుమారు రూ.5.75 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అరకుతో పాటు సుమారు 20 గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులున్నారు.

హైరిస్క్ మలేరియా గ్రామాల్లో ఏసీఎం ద్రావణం పిచికారీ

- జిల్లాలో 401 గిరిజన గ్రామాల్లో దోమల నివారణా మందు పిచికారీకి చర్యలు
- డీఎంహెచ్ఓ జగన్మోహనరావు

సీతంపేట: జిల్లాలో 401 హైరిస్క్ మలేరియా గ్రామాల్లో తొలివిడతలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నామని జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. 'సాక్షి'తో ఆయన శనివారం మాట్లాడారు. ఈనెలాఖరుకు అన్ని గ్రామాల్లో ఫస్ట్ రౌండ్ ఏసీఎం ద్రావరణం పిచికారీ పూర్తవుతుందన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 51 గ్రామాలకు గాను 45 గ్రామాల్లో 5 శాతం ఆల్ఫా సైఫర్ మెత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేశామని చెప్పారు. సీతంపేట మండలంలో 35 గ్రామాలకు 29, భామిని మండలంలో 10, పాలకొండలో 1, వీరఘట్టం మండలంలో 5 గ్రామాల్లో పిచికారీ పూర్తయిందన్నారు. గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో కూడా స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



స్వామి సన్నిధిలో కోలాటం ఆడుతున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన కళారాధన కార్యక్రమం భక్తులను అలరించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామి సన్నిధిలో భక్తి గీతాలకు కోలాటం ఆడారు. సుమారు రెండు గంటల పాటు నిర్విరామంగా నృత్యాలు చేసి అలరించారు. శనివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యారంగం నుంచి కార్పొరేట్ శక్తులను తరిమేయాలి

విజయనగరం అర్బన్: పేదలకు విద్యను అందుబాటులో ఉంచేందుకు కార్పొరేట్ శక్తులను విద్యారంగం నుంచి వెల్లగొట్టాలని మానవ హక్కుల వేదిక, భారత నాస్తిక సమాజం జిల్లా కమిటీ సంయుక్తంగా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘాల జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు శనివారం స్థానిక అమర్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలని, ఈ రంగాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించే విధంగా నూతన ప్రభుత్వం చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానం వల్ల మధ్యయుగం నాటి కుల వృత్తులను పరోక్షంగా పిల్లలపై పడుతోందని పేర్కొన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దతోందని ఆరోపించారు. డిగ్రీ విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు యువతకు ప్రయోజనం చేకూరేలా లేవన్నారు. మరోవైపు ప్రభుత్వం మొత్తం విద్యారంగాన్నే ప్రైవేటీకరకు బాటలు వేస్తోందని విమర్శించారు.





ఇది విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి. గతంలో దీని బోర్డు 'మహారాజ ప్రభుత్వ ఆసుపత్రి' అని ఉండేది. వాస్తవానికి జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం వైద్య కళాశాలకు అన్ని వైద్య సౌకర్యాలతో 300 పడకల సామర్థ్యంతో కనీసం రెండేళ్ల పాటు పూర్తిస్థాయిలో పనిచేస్తున్న ఆసుపత్రి అనుబంధంగా ఉండాలి. ఈ దృష్ట్యా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయనగరంలోని ఈ ఆసుపత్రిని ఆధునీకీకరించింది. దాదాపు రూ.8.50 కోట్ల ఖర్చుతో 330 పడకల సామర్థ్యంతో అన్ని విభాగాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపర్చింది. నిబంధనల ప్రకారమే ఆసుపత్రి పేరును 'ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి'గా మార్పు చేసింది. కానీ ఇప్పుడు ఇంకా టీడీపీ ప్రభుత్వం కొలువుదీరనే లేదు. అధికారిక ఉత్తర్వులేవీ రాలేదు. టీడీపీ కార్యకర్తలకు ఇవేవీ పట్టలేదు. దుందుడుకు చర్యలకు దిగారు. ఆస్పత్రి బోర్డును ధ్వంసం చేశారు. 'సర్వజన' అక్షరాలను తీసేసి 'మహారాజ' అనే అక్షరాలను బోర్డులో చేర్చేశారు.

సర్వజన స్థానంలో మహారాజ

- విజయనగరం ప్రభుత్వాస్పత్రి పేరుపై టీడీపీ దాష్టీకం
- అధికారిక పత్రాల్లో లేకపోయినా అక్రమంగా మార్పు
- టీడీపీ ప్రభుత్వం ఏర్పడకముందే ఆస్పత్రి పేరు ధ్వంసం
- వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే మెడికల్ కాలేజీ సాకారం
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా జిల్లా ఆస్పత్రి ఆధునికీకరణ
- నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా నామకరణం
- అనధికారికంగా టీడీపీ కార్యకర్తలు 'సర్వజన' పేరు ధ్వంసం
- విస్తుపోతున్న జిల్లా ప్రజలు



ఇది విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. వారికి ఇచ్చిన మాట ప్రకారం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేసింది. 2020 సంవత్సరంలో శంకుస్థాపన చేసిన జగన్‌మోహన్‌రెడ్డే... రూ.500 కోట్ల వ్యయంతో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గత ఏడాది సెప్టెంబర్ 15న మెడికల్ కాలేజీని ప్రారంభించిందీ ఆయనే! అంతకుముందు టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నా, అశోక్ గజపతిరాజు విజయనగరం ప్రజల ఓట్లతో దశాబ్దాలుగా అత్యున్నత పదవులు పొందినా ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయలేకపోయారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

విజయనగరం జిల్లా ఏర్పాటై నాలుగు దశాబ్దాలు గడిచిపోయింది. పొరుగు జిల్లాలైన విశాఖలో ఆంధ్రా మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఉన్నాయి. విజయనగరం జిల్లా ప్రజలకు మాత్రం ప్రభుత్వ మెడికల్ కాలేజీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేసేవరకూ అందని ద్రాక్షగానే ఉంది. అంతకుముందు 'మాన్సాస్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామంటూ అనేకసార్లు అరచేతిలో వైకుంఠం చూపించిన టీడీపీ నాయకులు తర్వాత చేతులెత్తేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' కార్యక్రమంతో వైద్యరంగంలో పెనుమార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య సేవల్లో పునరుజ్జీవనమే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, చేరువలో మెరుగైన వైద్యమే ధ్యేయంగా 'నాడు-నేడు' కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసింది. వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలను భారీ సంఖ్యలో చేపట్టింది. 'ఫ్యామిలీ డాక్టర్' పేరుతో ప్రతి గడపకూ వెళ్లి ప్రజల ఆరోగ్య తీరుతెన్నులను వైద్యులు తెలుసుకునే కార్యక్రమానికీ శ్రీకారం చుట్టింది. సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రతి జిల్లాలోనూ అందుబాటులో తేవడంతో పాటు అదనపు మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా రాష్ట్రంలో విజయనగరం సహా 17 కొత్త మెడికల్ కాలేజీలను నెలకొల్పింది.

నిబంధనల ప్రకారమే పేరు మార్పు...

విజయనగరం శివారు గాజులరేగ వద్ద 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల నిధులతో ప్రభుత్వ మెడికల్ కాలేజీని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2023-24 విద్యా సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభమయ్యాయి. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం మెడికల్ కాలేజీకి అనుబంధంగా అన్ని వైద్య సౌకర్యాలతో 300 పడకల సామర్థ్యం ఉన్న ఆస్పత్రి కనీసం రెండేళ్ల పాటు పూర్తి స్థాయిలో పనిచేస్తూ ఉండాలి. ఈ దృష్ట్యా విజయనగరంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని కొత్త మెడికల్ కాలేజీకి అనుబంధంగా మార్పు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఆస్పత్రి పేరు కూడా 'ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి'గా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 330 పడకల సామర్థ్యంతో రూ.8.50 కోట్లతో వైద్య సౌకర్యాలను మెరుగుపర్చింది. అలా ఉమ్మడి విజయనగరం ప్రజలకు వ్యయప్రయాసలు తీరాయి. అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నానికి పరుగులు తీయాల్సిన ఆగత్యం తప్పింది. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలన్నీ ఇక్కడే లభిస్తున్నాయి.

తమ్ముళ్లు అర్థం చేసుకోరూ...

అవసరమైతే తప్ప ఏదో ఉద్దేశపూర్వకంగానో, కడుపుమంటతోనే సంస్థల పేరును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్చిందే లేదు. జిల్లా ఆస్పత్రిలో భాగంగానున్న విజయనగరం అంబటిసత్రం జంక్షన్‌లోనున్న ప్రసూతి ఆస్పత్రి పేరు ఇప్పటికీ 'మహారాణి ఘోష ఆస్పత్రి'గానే ఉంది. వాస్తవానికి జిల్లా సర్వజన ఆస్పత్రి పూర్తిగా ప్రభుత్వ స్థలంలోనే ఉంది. విజయనగరం కంటోన్మెంట్ ఎంసీ బిట్-1లో 8.27 ఎకరాల పోరంబోకు స్థలం, కణపాక, అయ్యన్నపేట గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 197లో 8.92 ఎకరాల పోరంబోకు భూమిని అప్పట్లో ప్రభుత్వం కేటాయించింది. అంతేతప్ప ఆ భూమితో విజయనగరం రాజులకు గానీ, వారి ఆధీనంలోని మాన్సాస్ ట్రస్టుకు గానీ సంబంధమే లేదు. వారితో సంబంధం ఉన్న సంస్థలన్నీ ఇప్పటికీ మహారాజా పేరుతోనే నడుస్తున్నాయి.

'మహారాజ' కోసం టీడీపీ కార్యకర్తల దుశ్చర్య...

వాస్తవానికి విజయనగరంలో 'ప్రభుత్వ జిల్లా కేంద్ర వైద్యశాల' పేరుతో ఆస్పత్రి నిర్మాణానికి 1983 డిసెంబర్ 20న అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యాక 1988 అక్టోబర్ 8న ఆయనే ప్రారంభించారు. ఈ రెండు సందర్భాల్లో వేసిన శిలాఫలకాల్లో 'ప్రభుత్వ జిల్లా కేంద్ర వైద్యశాల' అనే ముద్రించారు. అంతేకాదు మంత్రి హోదాలో 1983లో ఆనంద్ గజపతిరాజు, 1988లో అశోక్‌గజపతిరాజు ఆ కార్యక్రమాలకు హాజరయ్యారు. 'మహారాజా' అని ఆస్పత్రికి పేరు ఎందుకు పెట్టలేదని వారెవ్వరూ అభ్యంతరం చెప్పలేదు. తర్వాత కాలంలో ఆస్పత్రి నేమ్ బోర్డులోకి 'మహారాజ' అక్షరాలను చేర్చారు. అధికారిక పత్రాల్లో ఆ మార్పు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ఇన్‌పేషెంట్ కేసుషీట్లలో కానీ, అవుట్ పేషెంట్ (ఓపీ) రికార్డుల్లో కానీ ఇప్పటికీ లేదు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాలోనూ విజయనగరం జిల్లా ఆస్పత్రి అనే ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంసీఐతో నిర్వహించిన ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ ఆ విధంగానే ప్రస్తావించింది. ఇన్నాళ్లూ 'జిల్లా ఆస్పత్రి'గా ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్తు (ఏపీవీవీపీ) పరిధిలో ఉండేది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా తీసుకుంటున్న దృష్ట్యా నిబంధనల ప్రకారం ఏపీ వైద్య విద్యాశాఖ డైరెక్టర్ ఆధీనంలోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా ఆస్పత్రికి 'ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి'గా పేరు మారింది. ఇదీ టీడీపీ వారికి నచ్చలేదు. కౌంటింగ్ ఇలా పూర్తి అయ్యిందో లేదో ఆసుపత్రి బోర్డును ధ్వంసం చేశారు. 'సర్వజన' అక్షరాలను తీసేసి 'మహారాజా' అనే అక్షరాలను చేర్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

- చేతికి గాయం
- మరో మహిళపై కూడా దాడి



టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నరేష్

గంట్యాడ: ప్రజలకు మరింత మంచి చేస్తారన్న ఉద్దేశంతో టీడీపీ అభ్యర్థులకు ప్రజలు, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు ఓటేసి గెలిపించాయి. అయితే.. కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ ఓటుకే మచ్చ తెచ్చేలా ప్రవర్తిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చి నాలుగురోజులు గడవకముందే ప్రజలపై అనవసరంగా దాడులకు దిగుతున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ప్రశాంతమైన పల్లెల్లో వివాదాలు సృష్టిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గంట్యాడ మండలంలోని పెదమధుపాడ గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు డీజే పెట్టి బాణసంచా కాల్చుతూ ర్యాలీ నిర్వహించారు. బాణ సంచాను వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇంటి ముందు పేల్చారు. శిరికి నరేష్ అనే కార్యకర్త కాస్త దూరంగా బాణసంచా కాల్చాలని సూచించడంతో ఒక్కసారిగా రెచ్చిపోయిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అతనిపై దాడిచేశారు. అతనిచేతికి తీవ్రగాయం కావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాడు. నరేష్‌పై దాడి చేసిన తర్వాత తామడ బంగారమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తావా అంటూ బూతులు తిడుతూ ఆమెపై దాడి చేశారు. ఆమె గంట్యాడ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. సీఐతో కలిసి ఫిర్యాదుపై విచారణ చేపడతామని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం రూరల్: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి యావత్ పత్రికా రంగానికి తీరని లోటని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రామోజీరావు ఆకస్మిక మరణం పట్ల శనివారం ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలుగు దిన పత్రికను తెలుగు వారి లోగిళ్లకు చేర్చిన ఘనత రామోజీరావుకే దక్కిందన్నారు. పత్రికా రంగంలో ఆయన చేయని ప్రయోగాలు లేవని, పాత్రికేయ రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే ఎంతటి ఉన్నత స్థానానికైనా చేరుకోవచ్చునని, రామోజీ జీవితాన్ని చూసి నేర్చుకోవచ్చన్నారు.

ద్వారకామయి అంధుల పాఠశాల మూసివేత



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకామయి అంధుల పాఠశాల వ్యవస్థాపకురాలు మాచేపల్లి ఆశాజ్యోతి, పక్కన పాఠశాల టీచర్లు

విజయనగరం టౌన్: అంధ విద్యార్థులకు క్రమశిక్షణాయుత ఉచిత విద్యాబోధన సాగిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు దారి చూపిన ద్వారకామయి అంధుల పాఠశాలను మూసివేస్తున్నట్టు యాజమాన్యం శనివారం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపకురాలు మాచేపల్లి ఆశాజ్యోతి పాఠశాల మూసివేతకు గల కారణాలను వివరించారు. 2013లో 16 మంది అంధ విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించామన్నారు. నేడు 60 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. నాటి నుంచి నేటి వరకు తరగతులను అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల భవనానికి అవసరమైన స్థలం కోసం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అద్దె భవనం ఖాళీ చేయమని భవన యజమాని ఖరాఖండిగా చెప్పడంతో చేసేదిలేక, లక్షల రూపాయల అద్దె చెల్లించి పాఠశాలను నడిపే స్తోమతలేక విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే మూసివేసేందుకు నిర్ణయించామన్నారు. 11 ఏళ్ల కాలంలో ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించామని తెలిపారు. వివిధ రంగాల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో 700కి పైగా ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులను ఎక్కడ చేర్చాలన్నది వారి తల్లిదండ్రుల ఇష్టమన్నారు. భవిష్యత్తులో సాయికృప సేవాసంస్థ తరఫున సేవా కార్యక్రమాలు యధాతథంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకూ పాఠశాల నిర్వహణకు సహకారమందించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

మన్యంకు జ్వరమొచ్చింది

- ఆరంభమైన ఎపిడమిక్ సీజన్
- ముసురుకుంటున్న వ్యాధులు
- వైరల్, టైఫాయిడ్ కేసుల నమోదు
- కిటకిటలాడుతున్న ఏజెన్సీ పీహెచ్‌సీలు
- పెరుగుతున్న ఇన్‌పేషెంట్లు



రక్త పరీక్షల గది వద్ద రోగులు



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు

సీతంపేట: మన్యంలో ఎపిడమిక్ సీజన్ ఆరంభమైంది. అధిక ఉష్ణోగ్రతలు, అడపాదడపా కురిసే వర్షాలు, కలుషితమైన నీటితో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తాయి. ఈ ఏడాది కూడా జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏజెన్సీలోని అన్ని పీహెచ్‌సీలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైరల్, టైఫాయిడ్ జ్వరపీడితులకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. అక్కడక్కడా మలేరియా, డయేరియా కేసులు సైతం నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

పెరుగుతున్న ఓపీ నమోదు

మారుమూల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం రోజుకు 50 నుంచి 70 వరకు ఓపీ నమోదవుతోంది. వీరిలో అధిక మంది జ్వరాలతో బాధపడేవారే ఉంటున్నారు. ఏరియా ఆస్పత్రుల్లో సైతం 200లకు పైగా కేసులు నమోదవుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వైరల్, టైఫాయిడ్ జ్వరాలు అధికమవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రక్త పరీక్షల్లో 60 శాతం టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఈ నెలలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నట్టు వైద్యులే చెబుతున్నారు. ఇప్పుడే ఈ తరహా జ్వరాలు ఉంటే రానున్న మరో నెలరోజులు ఇంకా వర్షాలు పడితే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుందని వైద్యసిబ్బంది అంచనా వేస్తున్నారు.

ఏప్రిల్, మేనెలల్లో ఏజెన్సీలో కొండలపై ఉన్న గ్రామాల్లో బోర్లు, బావులు అడుగంటడంతో కొండకోనల్లో ఎక్కడో ఉన్న ఊటజలాలను గిరిజనులు తాగుతుండడంతో టైఫాయిడ్ వంటి జ్వరాలు అధికంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. దోనుబాయి, మర్రిపాడు, కుశిమి, సీతంపేట, కడగండి, పొల్ల, దోనుబాయి తదితర పంచాయతీల పరిధిలోని గిరిజన గూడల్లో జ్వర పీడిత కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

చాపకిందనీరులా మలేరియా వ్యాప్తి

ఏజెన్సీలో మలేరియా కేసులు కూడా అక్కడక్కడా నమోదవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మలేరియా కేసులు తగ్గాయని జిల్లా మలేరియా నివారణ అధికారులు తెలియజేస్తున్నా చాపకింద నీరులా మలేరియా వ్యాప్తి చెందుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 50కి పైగా మలేరియా కేసులు నమోదైనట్టు మలేరియాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2022లో 236 2023లో 264 మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసుల సంఖ్య వీటికి అదనం. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్నచోట మలేరియాకు కారణమయ్యే ప్లాస్మోడియం పరన్నాజీవి ఆడ ఎనాఫిలిస్ దోమ వృద్ధి చెంది జ్వరాల వ్యాప్తికి కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులో అన్ని రకాల మందులు

పీహెచ్‌సీల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు అందజేస్తున్నాం. ముందుగా వైద్యపరీక్షలు చేసి వ్యాధినిర్ధారణ అయ్యాక కోలుకునేలా చికిత్స చేస్తున్నాం. మలేరియా కారక దోమల నివారణకు ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని హైరిస్క్ గ్రామాల్లో పిచికారీ చేయిస్తున్నాం.

– కె.విజయపార్వతి, డీఎండ్‌హెచ్‌ఓ

15న పతంజలి పురస్కార సభ

- పురస్కార గ్రహీత రౌతు బంగారునాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రముఖ రచయిత, సీనియర్ పత్రికా సంపాదకులు కె.ఎన్.వై.పతంజలి 72వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15న పతంజలి పురస్కార సభ ఏర్పాటు చేస్తామని పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. అదే రోజు ఏటావలే పతంజలి సాంస్కృతిక వేదిక రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని రచయిత, వివిధ చానెల్స్‌కు కంటెంట్ రైటర్‌గా పనిచేస్తున్న రౌతు బంగారునాయుడుకి విజయనగరం జిల్లా గ్రంథాలయం రీడింగ్ హాల్‌లో ప్రదానం చేస్తామని చెప్పారు. గురజాడ గృహంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌతు బంగారునాయుడు పతంజలి వలే సీరియస్ రచనలతో పాటుగా వర్తమాన రాజకీయాలపై కొంటె కోణంలో తన కలం ద్వారా మంచి రచనలు అందించారన్నారు. ఆయన రచనలు ప్రజలను ఆకట్టుకునేలా ఉంటాయన్నారు. వేదిక కార్యదర్శి ఎస్.కె.బాబు మాట్లాడుతూ బంగారునాయుడు పేరును పురస్కార కమిటీ ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయుడు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, భళ్ళమూడి నాగేంద్రప్రసాద్, శ్రీహ రిరాజు ప్రతిపాదించారన్నారు. పతంజలి అభి మానులు, సాహిత్య అభిమానులు పురస్కారసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, జలంత్రి రామచంద్ర రాజు, గురజాడ ప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేదిక ప్రతినిధులు



రౌతు బంగారు నాయుడు

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పూసపాటిరేగ : మండలంలోని చంపావతి నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. ట్రాక్టర్లను శనివారం సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



మద్దిల వాసు

నెల్లిమర్ల: రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిల వాసు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మారిన దృష్ట్యా తన పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజీనామా లేఖను సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. పదవీ కాలంలో తనకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతిలో పడి వ్యక్తి మృతి



నూతిలో నాగేశ్వరరావు మృతదేహం

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస గ్రామానికి చెందిన వడ్డి నాగేశ్వరరావు (53) నూతిలో పడి మృతి చెందిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.పెద్దవలస గ్రామంలో ఈనెల 6వ తేదీన నాగేశ్వరరావు బంధువుల వివాహం జరిగింది. రాత్రి వరకు నాగేశ్వరరావు పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. 7వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు వెతకసాగారు. పక్క గ్రామమైన పాతకామునివలస సమీపంలోని నూతిగట్టుపై నాగేశ్వరరావు దుస్తులు ఉండడంతో అనుమానం వచ్చి నాగేశ్వరరావు కుమారుడు చంటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినప్పటికీ, ఎటువంటి ఆనవాలు కనిపించలేదు. శనివారం ఉదయం నూతిలో మృతదేహం తేలియాడుతున్న విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పోలీసులుకు సమాచారం అందించారు. ఎస్సై నరసింహమూర్తి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రైలు కింద పడి...



తెంటు భరత్ (ఫైల్)

పార్వతీపురం టౌన్: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జ్ రత్నాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పార్వతీపురం పట్టణం బూరాడ వీధికి చెందిన తెంటు భరత్ (31) ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని దాలియుడువలస రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి పంపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో వ్యక్తి మృతి



లంకాడ నరేష్ మృతదేహం

మర్రిపాలెం (విశాఖ జిల్లా) : విశాఖలోని జ్ఞానాపురం రైల్వేస్టేషన్ గేట్ నంబర్ 4 సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా అందులో ఒక నంబర్‌కు ఫోన్ చేయగా మృతుడు విజయనగరానికి చెందిన లంకాడ నరేష్‌గా గుర్తించారు. మూడు రోజుల క్రితం ఓ పెళ్లికని వచ్చాడని పోలీసులు తెలిపారు. అయితే రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు జారిపడ్డాడా, లేదా మరే ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియల్సి ఉందని వారు తెలిపారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270



- తల్లిదండ్రులకు గుదిబండగా మారుతున్న ఫీజులు
- మరికొద్ది రోజుల్లో పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- ఇప్పటికే పుస్తకాల పేరిట హడావిడి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- ప్రతి ఏడాదీ పెరుగుతున్న చదువు ఖర్చులు

చదువు భారం..

విజయనగరం: వేసవి సెలవులు ముగియనున్నాయి. మరో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు చూసి పేద, మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. బ్యాగ్, పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, బూట్లు వంటి ధరలు కూడా ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. జూన్ వచ్చిందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. పట్టణాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లోనే చదివించాలని పట్టుదలతో ఉంటున్నారు. పిల్లలకు ఐదు సంవత్సరాలు దాటగానే ఏ పాఠశాలలో వేయాలి? ఎక్కడ బాగుంటుంది? మా అబ్బాయి పదో తరగతి పాసయ్యాడు.. ఏ కళాశాలలో జాయిన్ చేయాలి? అనే అంశాలపైనే చర్చించుకుంటున్నారు. అందుకు అవసరమయ్యే వస్తువులను ఇబ్బంది పడుతూనే కొనుగోలు చేస్తున్నారు.



విక్రయాలకు సిద్ధంగా ఉన్న పుస్తకాలు



వామ్మో జూన్....

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు జూన్ నెల వచ్చిందంటే ఎక్కడలేని భయం. విద్యార్థులను పాఠశాలలకు పంపించడంతో పాటు రైతులు సాగు ప్రారంభించేందుకు డబ్బులు చూసుకోవాలి. దీంతో ఈ నెలలో ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయి. మార్కెట్‌లో విద్యార్థులకు కావాల్సిన బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాలు, ఆటో, బస్ చార్జీలు వంటి వాటితో చుక్కలు కనపడుతున్నాయి. ఆదాయం తక్కువగా ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు ఈ నెల పెనుసవాల్‌గా మారింది. పాఠశాలలో కనీస సౌకర్యాలు ఎలా ఉన్నా ఫీజులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీలో చేర్పించాలంటే తక్కువలో తక్కువగా రూ.7 వేల నుంచి 10 వేల రూపాయల వరకు ఫీజు చెల్లించాల్సిందే. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు టెస్టు, వర్క్, నోట్ పుస్తకాలకు కనీసం ఐదు వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అంతే కాకుండా యూనిఫాం, టీ షర్టులకు కూడా వేలల్లోనే ఖర్చవుతోంది.

చదువులు భారమవుతున్నాయి

పోటీ ప్రపంచంలో పిల్లల చదువులు రోజురోజుకూ భారమవుతున్నాయి. చిన్నపాటి స్కూల్‌లో చేర్పించాలన్నా వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. అదే కాస్త పేరున్న స్కూల్‌లో చదివించాలంటే రూ. లక్షలు కట్టాల్సిందే. ఇవి కాకుండా పుస్తకాలు, దుస్తులు, బస్సు ఫీజులు అదనపు ఖర్చులు. దీంతో జూన్ నెల వచ్చిందంటే బడ్జెట్‌లు తారుమారవుతున్నాయి. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులుగా ఖర్చు చేస్తున్నాం.

– ఎస్.మల్లికార్జున రావు, విద్యార్థి తండ్రి, విజయనగరం.

దుకాణాలు కిటకిట..

విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, చెప్పుల షాపులు విద్యార్థుల తల్లిదండ్రులతో కళకళలాడుతున్నాయి. పలు ప్రైవేట్ పాఠశాలలయితే తమ వద్దనే పుస్తకాలు కొనుగోలు చేసేలా పుస్తక షాపుల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా బ్యాగులు రూ.200 నుంచి రూ.1000, రెండు జతల స్కూల్ డ్రస్సులతో పాటు వైట్ డ్రస్సు ఒక జత, టీషర్టు ఒకటి కలిపి తక్కువలో తక్కువగా రూ. 4 వేల వరకు ఉంటున్నాయి. ఈ ఖర్చులు తల్లిదండ్రులకు గుదిబండలా మారాయి.

గర్భిణుల వసతిగృహం పరిశీలన

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని కేంద్ర వైద్య బృంద అధికారులు సుదర్శన్ భగత్, సాలేన్ శాన్యాల్ శనివారం పరిశీలించారు. వసతిగృహంలో అందిస్తున్న సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితి, తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాచిపెంట మండలంలోని పనుకువలస, మంచాడవలస గ్రామాలను సందర్శించారు. ప్రిజమ్ - 10లో భాగంగా గిరిజన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, హెచ్‌బీ పరీక్షలు, తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే సామూహిక సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ అనిల్, సీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్, వైటీసీ మేనేజర్ సాగర్, ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణుల వసతిగృహం వద్ద మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

ఆహార భద్రత ప్రమాణాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



రింగ్ రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్

విజయనగరం: లిక్విడ్ నైట్రోజన్ ఉపయోగించే బిస్కెట్స్‌తో నోరు, గొంతు, అన్నవాహిక, కడుపులో తీవ్రమైన గాయాలు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తి ప్రాణాపాయ సమస్యలు తలెత్తుతాయని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా హెచ్చరించారు. పట్టణంలోని రింగురోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఫుడ్ కోర్టులను శనివారం ఆయన సందర్శించి అక్కడి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిక్విడ్ నైట్రోజన్ శరీరంలోకి వెళ్లడం వల్ల ఆక్సిజన్ అందక మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతారన్నారు. స్మోక్ బిస్కెట్స్ తినవద్దని సూచించారు. స్మోక్ బిస్కెట్స్ విక్రయిస్తున్న స్టాల్‌ను సీజ్ చేశారు. అనంతరం బజ్జీ స్టాల్స్‌ను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. ఎక్కువ సార్లు మరిగించిన నూనెతో మంచూరియా, బజ్జీలు వేయించడం వల్ల క్యాన్సర్, గుండె సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోటళ్లు, ఫుడ్ కోర్టుల్లో ఆహార భద్రత ప్రమాణాలు పాటించనట్లయితే వినియోగదారులు 8790603489 ఫోన్‌కు సమాచారం అందించాలని, తనిఖీలు నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రైలు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ, తదితరులు

- చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ

విజయనగరం టౌన్: రైలు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ సూచించారు. ఇంటర్నేషనల్ లెవిల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే పురస్కరించుకుని శనివారం స్థానిక వీటీ అగ్రహారం సమీపంలో ఉన్న రైల్వే లెవిల్ క్రాసింగ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే క్రాసింగ్‌లు దాటే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గేట్ కింద నుంచి దూరి వెళ్లడం సరికాదని సూచించారు. లెవిల్ క్రాసింగ్‌లు దాటినప్పుడు చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకుని వెళ్లడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్స్ ఆర్‌ఆర్.కుమార్, సీహెచ్ శ్రీధర్‌రావు, జి.జగన్నాథం, పి. గోవింద ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యసేవలపై సమీక్ష సమావేశం

పార్వతీపురం టౌన్: స్థానిక జిల్లా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు ఆధ్వర్యంలో జిల్లాలో నేత్ర పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, తదితర అంశాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో చేపట్టిన సేవలు, భవిష్యత్‌లో చేయాల్సిన పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 26,000 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 14,109 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. అలాగే 1890 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, సహాయకులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి, సహాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు

వార్షికవేతనం @ 50 లక్షలు



చైతన్యను సత్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

- సెంచూరియన్ వర్సిటీ విద్యార్థి చైతన్య ప్రతిభ
- విద్యార్థిని సత్కరించిన వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో బీ టెక్ పూర్తి చేసిన కుసుమంచి చైతన్య అరుదైన ఘనతను సాధించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన ప్లాంట్ నెట్‌వర్క్ సంస్థలో రూ.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన చైతన్య కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా డు. ఈ మేరకు చైతన్యను వర్సిటీ ఆవరణలో శనివారం సత్కరించా రు. ఈ సందర్భంగా వీసీ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అధ్యాపకులు డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో 'చిటుక' నివారణ

- చిటుక రోగంపై నిర్లక్ష్యం తగదు
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి
- పశు సంవర్థక శాఖాధికారులు

రామభద్రపురం: జీవాలకు ఆశించే చిటుక రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ రోగం ఆశిస్తే జీవాలు నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. వ్యాధి ఆశించిన చిటుకలో చనిపోతాయి కాబట్టే ఈ వ్యాధికి చిటుక రోగం అంటారు. జిల్లాలో సుమారుగా 1,30,180 గొర్రెలు, 43,101 మేకలున్నాయి. వీటికి చిటుక వ్యాధి సోకుండా, అలాగే నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. టీకాలు కార్యక్రమం మొదలైన నేపథ్యంలో గొర్రెల్లో ఈ వ్యాధి ఎప్పుడు వస్తుంది..?, లక్షణాలు ఎలా ఉంటాయి..?, నివారణ పద్ధతులపై పశుసంవర్థక శాఖాధికారులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

సులభంగా వ్యాపిస్తుంది..

గొర్రెలు, మేకలకు గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు, మొదలైన అంటువ్యాధులు తొందరగా సోకుతాయి. ఒక మంద నుంచి వేరొక మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకరమైన ప్రాణాంతకమైన వ్యాధులకు చికిత్స బదులు నివారణే శ్రేయస్కరమని గుర్తించాలి. అంటువ్యాధులు సోకక ముందే ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

లక్షణాలు..

రాత్రి బాగా ఉండి తెల్లారే సరికల్లా ఎక్కువ సంఖ్యలో జీవాలు మరణిస్తుంటాయి. కళ్ల ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి అకస్మాత్తుగా మరణిస్తాయి. జ్వరం, పళ్లు కొరకడం, వణకడం, బిగుసుకునిపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండడం, కాళ్లు బిగిసిపట్టి నడవడం, శ్వాస కష్టమవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపు నొప్పి, మందకొడిగా ఉండడం, మేత సరిగ్గా తినకపోవడం వంటి లక్షణాలుంటాయి.



రామభద్రపురం పొలాల్లో గొర్రెల మంద

నివారణ ఇలా...

- వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలకు పెరిగిన గడ్డిని ఎక్కువగా మేపరాదు.
- వరి కోసిన తర్వాత మిగిలిన కర్రలను ఎక్కువగా మేపరాదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందు వేయాలి.
- 30 రోజుల వయసున్న గొర్రె, మేక పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మూడు నెలల తర్వాత బూస్టర్ డోస్ వేయించాలి. గొర్రెలు, మేకలకు ఆరు నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు అత్యధికంగా పాలు తాగకుండా గమనించాలి.
- పాలు తాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమ క్రమంగా మార్చుకుంటూ వెళ్లాలి.
- మేకలకు పూర్తిగా పప్పు జాతి పశుగ్రాసాలు వేయరాదు.

గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం..

ఈ వ్యాధి మేకలకన్నా గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. తొలకరిలో పెరిగిన పచ్చికను అతిగా మేయడం వల్ల శరీరంలో ఎప్సిలాల్ అనే విష పదార్థం విడుదల కావడం వల్ల ఈ వ్యాధి ఆశిస్తుంది.



తారాపురంలో చిటుక రోగం నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది (ఫైల్)

చిటుక రోగం నివారణే లక్ష్యం..



సాధారణంగా వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. వ్యాధి రాకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. సంవత్సరం వయసున్న గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే గొర్రెల్లోను, వలస గొర్రెల్లోనూ ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకకముందే నిరోధక టీకాలు వేయిస్తే జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

– ఎల్ విష్ణు,పశుసంవర్థశాఖ ఎ.డి., బొబ్బిలి